సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం : 3 : జూన్ : 2024



కార్పొరేట్‌కు దీటుగా సేవలు
కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా సేవలం దిస్తున్నామని పోచంపల్లి కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ పేర్కొన్నారు. - 10లో



యాదాద్రిలో భక్తుల రద్దీ
యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారిని ఆదివారం 45వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. -10లో

గరిష్టం / కనిష్టం
39°/27°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నీర్నెముల వాసికి ఉత్తమ సేవాపతకం



కమాండెంట్ నుంచి సేవాపతకం తీసుకుంటున్న నోముల నర్సయ్య

రామన్నపేట : మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన నోముల నర్సయ్య రాష్ట్ర స్థాయి ఉత్తమ పోలీస్ సేవా పతకం అందుకున్నారు. నర్సయ్య ప్రస్తుతం హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ బెటాలియన్‌లో రిజర్వ్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో కమాండెంట్ మురళీకృష్ణ చేతుల మీదుగా సేవాపతకం అందుకున్నారు.

ప్రత్యేక స్టాప్‌లను వినియోగించుకోవాలి

నల్లగొండ రూరల్ : నల్లగొండ, మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ వెళ్లే నాన్ స్టాప్ బస్సులు నిలపడం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాప్‌లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఎం ఎస్.శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు మాత్రమే ఈ సౌకర్యం ఉంటుందని ఆమె పేర్కొన్నారు. నార్కట్‌పల్లి నుంచి ప్రయాణించే ప్రయాణికులకు కూడా నల్లగొండ నుంచి ప్రయాణించినట్లుగా చార్జీలు తీసుకుంటారని తెలిపారు.

ఉద్యమకారులను గుర్తించాలి



జెండా వందనం చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, నాయకులు

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. రాష్ట్ర అవిర్భావ దినోత్సవం సందర్భంగా భువనగిరిలోని పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేచిందని గుర్తు చేశారు. ఉద్యమంలో సీపీఐ కీలక పాత్ర పోషించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, ఏషాల అశోక్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వస్తువుల అభిలాష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి లక్ష్మయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, మండల కౌన్సిల్ సభ్యుడు కోట శంకర్ పాల్గొన్నారు.

కేఆర్‌ఆర్ కళాశాలకు అటానమస్ హోదా



కోదాడలోని కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

కోదాడ: కోదాడ పట్టణంలో ఆరు దశాబ్దాల చరిత్ర ఉన్న కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల త్వరలో మరో మైలురాయిని అందుకోనుంది. ఈ విద్యాసంవత్సరంలో జిల్లాలోనే స్వయంప్రతిపత్తి (అటానమస్) హోదా పొందే మొదటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా నిలవనుంది. ఈ కళాశాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వడానికి యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) ఇటీవల సూత్రప్రాయ అంగీకారాన్ని తెలిపింది. స్వయం ప్రతిపత్తి కోసం కళాశాల పంపిన ప్రతిపాదనలపై ఏప్రిల్ 16న యూజీసీ స్టాండింగ్ కమిటీ చర్చించి అటానమస్ ఇవ్వడానికి సూత్రప్రాయంగా అంగీకారం తెలుపుతూ ఈ కళాశాల అనుబంధంగా ఉన్న ఎంజీ యూనివర్సిటీకి అదే నెల 24న సమాచారం ఇచ్చింది. ఇందుకుగాను ఎంజీ యూనివర్సిటీ డిగ్రీ స్థాయిలో సైన్స్, కామర్స్, ఆర్ట్స్ విభాగాలతో పాటు, పీజీ కోర్సులను అందించడమే కాకుండా అన్ని రకాల ప్రయోగశాలలు, సొంత భవనాలు, ఇతర సౌకర్యాలతో పాటు ప్రభుత్వం నియమించిన పూర్తిస్థాయి ఫ్యాకల్టీ ఉన్నందున స్వయం ప్రతిపత్తి ఇవ్వడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఏప్రిల్ 30వ తేదీన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేసింది. దీంతో త్వరలో కళాశాలకు యూజీసీ స్వయం ప్రతిపత్తి ఇచ్చే అవకాశం ఉంది.

ఉద్యమ స్ఫూర్తితో ప్రగతి

- తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత శరవేగంగా పురోగతి
- జిల్లా అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి
- రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి, యాదాద్రి : తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో జిల్లా ప్రగతి పథంలో పయనిస్తోందని, అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, జిల్లా న్యాయమూర్తులు, అధికారులు, అనధికారులు, పాత్రికేయులు, స్వాతంత్ర్య సమరయోధులు, ఉద్యమకారులు, తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల కుటుంబాలు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యానికి ముందు నుంచే తెలంగాణకు పోరాటాల పురిటి గడ్డగా పేరుందన్నారు. దాశరథి కీర్తించినట్లుగా తెలంగాణ కోటి రతనాల వీణ అని, ఎన్నో వనరులు, మరెంతో చారిత్రక సంపద ఉందని, ఎందరో త్యాగధనులకు పుట్టినిల్లన్నారు. స్వపరిపాలన, సుపరిపాలనే లక్ష్యంగా తెలంగాణ ప్రజలు సుదీర్ఘకాలం సాగించిన పోరాట ఫలితంగా 2014 జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జిల్లా శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని పేర్కొన్నారు. ఈ క్రమంలో అందరం అంకితభావంతో పనిచేసి అమరుల త్యాగాలకు గుర్తింపునిద్దామన్నారు.

ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోనే భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో అత్యధిక పోలింగ్ నమోదైనదని, ఓటింగ్‌లో పాల్గొన్న ప్రజలందరికీ కలెక్టర్ ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్నికలు సజావుగా జరగడానికి కృషి చేసిన అధికారులు, సిబ్బంది, పోలీసు యంత్రాంగానికి.. పాలనను ప్రజలకు చేరువగా తీసుకెళ్లి అభివద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులు, స్వచ్ఛంద సంస్థలు, బ్యాంకర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తి కొనసాగిస్తూ అభివృద్ధికి పునరంకితం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఆర్డీఓ అమరేందర్, మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జెడ్పీ వైస్ చైర్మన్ బీకూ నాయక్, జెడ్పీటీసీలు బీరు మల్లయ్య, కుడుదుల నగేశ్, ఎంపీపీలు నరాల నిర్మల, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జాతీయ పతాకం ఎగురవేస్తున్న కలెక్టర్ హనుమంతు కే. జెండగే, చిత్రంలో డీసీపీ



భువనగిరిలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

అమరవీరులకు నివాళి

జాతీయ పతాకావిష్కరణకు ముందు కలెక్టర్ హనుమంతు కే.జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్లు గంగాధర్, బెన్‌షాలోమ్ తదితరులు రైతుబజారు వద్ద ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు.



గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

ఫలితాలపైనే అందరి దృష్టి!

- రేపే లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- ఏ ఇద్దరు కలిసినా అదే చర్చ
- కొన్ని ఎగ్జిట్‌పోల్స్ కాంగ్రెస్‌కు, మరికొన్ని బీజేపీకి విజయావకాశాలున్నట్లు వెల్లడి
- అభ్యర్థుల్లో ఎడతెగని ఉత్కంఠ



సాక్షి, యాదాద్రి : లోక్‌సభ ఎన్నికల్లో విజేత ఎవరో మరికొద్ది గంటల్లో తేలనుంది. మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం వరకు ఫలితంపై స్పష్టత వచ్చే అవకాశ ఉంది. కాగా కొన్ని ఎగ్జిట్‌పోల్స్ కాంగ్రెస్‌కు, మరికొన్ని బీజేపీకి విజయావకాశాలున్నట్లు తేల్చడంతో ఇరు పార్టీల అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. ద్వితీయశ్రేణి నాయకత్వంలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఏ ఇద్దరు కలిసినా దీనిపైనే చర్చ జరుగుతోంది. మే 13న జరిగిన ఎన్నికల్లో భువనగిరి లోక్‌సభ స్థానంలో ఓటర్లు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీజేపీ నుంచి బూర నర్సయ్యగౌడ్, కాంగ్రెస్ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, బీఆర్‌ఎస్ క్యామ మల్లేష్, సీపీఎం నుంచి ఎండీ జహంగీర్‌తో పాటు మొత్తం 39 మంది బరిలో నిలిచారు. అభ్యర్థులు ఎక్కువ మంది ఉన్నా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్యనే పోరు నడిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు భువనగిరి లోక్‌సభ స్థానం పరిధిలో 2.80 లక్షల ఓట్ల పైచిలుకు మెజార్టీ వచ్చింది.ఎంపీ ఎన్నికల్లో అంత మెజార్టీ రాకపోయినా గెలుపు తథ్యమన్న ధీమాలో కాంగ్రెస్ ఉంది.

గెలుపుపై బీజేపీ ధీమా..

మోదీ చరిష్మా, ప్రజల్లో బీజేపీ పెరిగిన ఆదరణ, ఎంపీగా గతంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులు గెలుపునకు దోహద పడుతాయన్న నమ్మకంతో అభ్యర్థి బూరనర్సయ్యగౌడ్ ఉన్నారు. దీంతో పాటు రాష్ట్రంలో బీజేపీ గణనీయమైన స్థానాలు గెలుచుకోబోతుందని ఎగ్జిట్‌పోల్స్ ప్రకటించడంతో గెలుపుపై ఆయన నమ్మకంతో ఉన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో గుబులు

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరు చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఒక చోట జనగామలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక చోట మినహా అందరూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉండడంతో భారీ మెజార్టీ సాధించాలని సీఎం రేవంత్‌రెడ్డి వారికి ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికలముందు హైదరాబాద్‌లో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇంట్లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్లమెంటరీ స్థాయి సన్నాహక సమావేశంలో మెజార్టీపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో సాధించిన మెజార్టీకి మించి ఎంపీ ఎన్నికల్లో సాధిస్తేనే మీ భవిష్యత్‌కు భరోసా ఉంటుందని ప్రత్యక్షంగా, పరోక్షంగా హెచ్చరించారు. దీంతో ఎమ్మెల్యేల్లో గుబులు పట్టుకుంది. విజయం సాధించడం ఖాయమైనప్పటికీ నిర్దేశించిన మెజార్టీ రాకపోతే ముఖ్యమంత్రి వద్దకు ఏ ముఖం పెట్టుకుని వెళ్తామని ఓ ఎమ్మెల్యే పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు గ్రామాల వారీగా నివేదికలు తెప్పించుకొని మెజార్టీపై ఓ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. కౌంటింగ్‌కు సమయం దగ్గర పడడంతో ఎమ్మెల్యేల్లో టెన్షన్ మొదలైంది.

ఈదురు గాలుల బీభత్సం

రామన్నపేట మండలం బాచుప్పల గ్రామంలో ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు కూలిపోయిన జినుకుల శ్రీశైలానికి చెందిన కోళ్ల ఫారం



ఐక్యతగా ఉంటే ఏదైనా సాధించవచ్చు

- జిల్లా ప్రధాన జడ్జి జయరాజు

భువనగిరి క్రైం : ఐక్యత, పరిపూర్ణ ఉంటే ఏదైనా సాధించవచ్చని జిల్లా ప్రధాన జడ్జి జయరాజు పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కోర్టులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయపరంగా, చట్టంలోని హక్కులను సాధీకరణ చేసుకునేలా చైతన్యం పొందాలన్నారు. ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి మాధవిలత మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తితో మనుగడ సాధిస్తే అద్భుతమైన నాగరిక సమాజం ఏర్పరుచుకోవచ్చన్నారు. న్యాయవాదులు చట్టాలపై ప్రజలకు పరిజ్ఞానం పెంచడంతో పాటు అర్హులకు న్యాయ సహాయం అందించేందుకు కృషి చేయాలని కోరారు. లోక్ అదాలతక్ష ఎక్కువ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు అరుణ, కార్యదర్శి కుక్కదూగ కృష్ణ, ఉపాధ్యక్షురాలు కె.జయ, న్యాయవాదులు బాలకష్టారెడ్డి, అంజయ్య, వంగేటి విజయభాస్కర్ రెడ్డి, వెంకటేశం, గోద వెంకటేశ్వర్లు గౌడ్, శ్రీధర్, జయ, రాంరెడ్డి, కృష్ణయ్య, శంకర్, మల్లేశ్, శ్రీనివాస్, శివకిరణ్, యాదయ్య, సురేష్, కష్ణ, రజని, జయ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జయరాజు



శ్రీలక్ష్మీనరసింహులకు లక్ష పుష్పార్చన చేస్తున్న అర్చకుడు

కనుల పండువగా లక్ష పుష్పార్చన

యాదగిరిగుట్ట : ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆలయంలో ఆదివారం లక్ష పుష్పార్చన కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం అర్చకులు సహస్రనామాలు పఠిస్తూ వివిధ రకాల పుష్పాలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. అదే విధంగా ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి.వేకువజామున సుప్రభాత సేవ, ఆరాధన చేపట్టారు. అనంతరం శ్రీస్వామి, అమ్మవారికి నిజాభిషేకం, అర్చన చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపం, ముఖ మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవారి జోడు సేవను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయానికి ద్వార బంధనం చేశారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- రౌండ్ల వారీగా ఫలితాల వెల్లడి
- పాస్‌లు ఉన్న వారికే అనుమతి
- కలెక్టర్ హనుమంతు కే. జెండగే

సాక్షి, యాదాద్రి : భువనగిరి లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు హనుమంతు కే.జెండగే తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి లోక్‌సభ నియోజక వర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు మంగళవారం భువనగిరిలోని అరోరా ఇంజనీరింగ్ కాలేజీలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. నోటాతో కలిపి 40మంది అభ్యర్థులు ఉన్నారని, ఫలితం సాయంత్రం నాలుగు గంటల వరకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఉదయం 6 గంటలకే అభ్యర్థులు కౌటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో తెరవనున్నట్లు పేర్కొన్నారు. రౌండ్ల వారీగా ఫలితాలను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, టేబుల్స్, రౌండ్లు ఇలా..

- ఓట్లు అధికంగా ఉన్న ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 343 పోలింగ్ కేంద్రాలకు గాను 20 టేబుల్స్ ఏర్పాటు చేసి 18 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేయనున్నారు.
- మునుగోడు 317 పోలింగ్ కేంద్రాలు ఉండగా 18 టేబుల్స్, 18 రౌండ్లలో ఓట్లు లెక్కించనున్నారు.
- భువనగిరి 257 పోలింగ్ కేంద్రాలకు 14 టేబుల్స్, 19 రౌండ్లు.
- నకిరేకల్ 311 పోలింగ్ కేంద్రాలకు 14 టేబుల్స్, 23 రౌండ్లు.
- తుంగతుర్తిలోని 326 పోలింగ్ కేంద్రాలకు 18 టేబుల్స్, 19 రౌండ్లు.
- ఆలేరు 309 పోలింగ్ కేంద్రాలు, 14 టేబుల్స్, 23 రౌండ్లు.
- జనగామ 278 పోలింగ్ కేంద్రాలు, 14 టేబుల్స్, 20 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించనున్నారు.

ప్రతి టేబుల్‌కు సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్

ప్రతి టేబుల్‌కు కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. మైక్రో అబ్జర్వర్‌తో కలిసి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రౌండ్ల వారీగా ఫలితాలు నమోదు చేయనున్నారు. కౌంటింగ్ సిబ్బందికి రెండు విడతల్లో శిక్షణ ఇచ్చారు.



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే, చిత్రంలో డీసీపీ, అదనపు కలెక్టర్

14 టేబుల్స్‌పై హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు

హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ప్రత్యేక హాల్‌లో లెక్కించనున్నారు. ఇందు కోసం 14 టేబుల్స్ ఏర్పాటు చేయనున్నారు. ప్రతి టేబుల్‌కు సూపర్‌వైజరు, ఇద్దరు అసిస్టెంట్లు, తహసీల్దార్ స్థాయి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఉంటారు. దీంతో పాటు సర్వీస్ ఓటర్లకు సంబంధించి ఈటీపీబీఎస్ పద్ధతిలో స్కానింగ్ ద్వారా కౌంటింగ్ చేయనున్నారు. కౌంటింగ్‌ను ఇద్దరు పరిశీలకులు పరిశీలించనున్నారు. కౌంటింగ్ సిబ్బందికి రెండ విడతలుగా శిక్షణ ఇచ్చారు. కౌంటింగ్ సిబ్బందికి డ్యూటీ పాస్‌లు ఇచ్చారు. పాస్‌లు ఉన్న వారిని మాత్రమే కౌటింగ్ హాల్లోకి అనుమతి ఇవ్వనున్నారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల బ్యాలెట్ కౌంటింగ్ ఉదయం 8.00 గంటలకు ప్రారంభం కానుంది.

కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత : డీసీపీ

కౌటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేయనున్నట్లు డీసీపీ రాజేశ్‌చంద్ర తెలిపారు. 144 ఆంక్షలు అమల్లో ఉంటుందని, ప్రతి స్ట్రాంగ్ రూం వద్ద సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర సాయుధ సిబ్బందితో పాటు ఏఆర్, సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారని పేర్కొన్నారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌ను సిద్ధంగా ఉంచుతామని చెప్పారు.ఎంట్రీ పాస్ లేకుండా ఎవరినీ కౌంటింగ్ హాల్‌లోకి అనుమతించబోమన్నారు. పోలీసు బారికేడింగ్, రిటర్నింగ్ అధికారి, అబ్జర్వర్లు, అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని వెల్లడించారు. కౌంటింగ్ హాల్ వద్ద మీడియా పాయింట్ ఏర్పాటు చేశామని, మీడియా సిబ్బంది ఎస్కార్ట్ అధికారితో వెళ్లి కౌంటింగ్ వివరాలను కవర్ చేయాలన్నారు. పోలీసు హెల్ప్ లైన్ కూడా ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) బెన్‌షాలోమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని అరికడదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

యాదగిరిగుట్ట : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని యాదాద్రి దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు కోరారు. యాదాద్రి కొండపైన ప్లాస్టిక్ నిషేధానికి భక్తులు, దుకాణదారులు సహకరించాలని కోరుతూ ఆదివారం యాదాద్రి కొండపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు, దుకాణదారులు ప్లాస్టికేతర వస్తువులు వాడాలని పేర్కొన్నారు. యాదాద్రీశుడి క్షేత్రంలో భక్తులకు ఆధ్యాత్మికత పంచడమే కాకుండా ఆహ్లాదం కోసం చెట్లను కాపాడవల్సిన అవసరం ఉందన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై రెండు వారాలుగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 15నుంచి నిషేధం పాటించాలని,లేనిపక్షంలో జరిమానా విధించనున్నట్లు హెచ్చరించారు. సంప్రదాయ దుస్తుల వాడకంపై భక్తులంతా స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ అధికారులు, వర్తక సంఘం నాయకులు, దుకాణదారులు పాల్గొన్నారు.



యాదాద్రి కొండపై ర్యాలీ నిర్వహిస్తున్న ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త, ఉద్యోగులు, వ్యాపారులు

క్లుప్తంగా

లారీ ఢీకొని గేదె మృతి

ఆత్మకూర్(ఎస్): మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో శనివారం రాత్రి లారీ ఢీకొని గేదె మృతిచెందింది. నూతనకల్ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న లారీ నెమ్మికల్లు బస్టాప్ వద్ద రోడ్డు పక్కన రేణికుంట్ల రవికి చెందిన గేదెను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గేదె అక్కడికక్కడే మృతిచెందగా.. సమాచారం తెలుసుకున్న పోలీసులు లారీని అదుపులోకి తీసుకున్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 40ఏళ్లకు పైగా ఉంటుందని రైల్వే పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


శివ (ఫైల్)

నాంపల్లి: చెట్టుకు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నాంపల్లి మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి మండల కేంద్రానికి చెందిన సొప్పరి శివ(24) చెడు వ్యాసనాలకు బానిసై అప్పులు చేశాడు. అప్పులు తీర్చడానికి ఎవరికీ చెప్పకుండా రెండు రోజుల క్రితం తన ఇంట్లో ఉన్న డబ్బు, బంగారం తీసుకొని వెళ్లాడు. ఇంట్లో డబ్బు, బంగారం కనిపించకపోవడంతో ఆదివారం శివ తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లగా.. విషయం తెలుసుకున్న శివ తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న శివ తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి సొప్పరి బుజ్జమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత

భువనగిరి క్రైం: అక్రమంగా ఆవులను తరలిస్తున్న బొలేరో వాహనాన్ని ఆదివారం భువనగిరి పట్టణంలో పోలీసులు పట్టుకున్నారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జిల్లా తుని నుంచి బొలేరో వాహనంలో ఏడు ఆవులు, ఎనిమిది దూడెలను తీసుకొస్తుండగా.. భువనగిరి పట్టణంలోని వినాయక చౌరస్తాలో ఆదివారం వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన ఆవులు, దూడెలతో పాటు బొలేరో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

భర్తపై బెంగతో భార్య ఆత్మహత్య

మోతె: భర్తపై బెంగతో భార్య చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మోతె మండల పరిధిలోని పెదరాజుతండాలో ఆదివారం జరిగింది. ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. బానోతు రంగమ్మ(80) భర్త గత నెల 5వ తేదీన మృతిచెందాడు. భర్తపై బెంగతో రంగమ్మ శనివారం సాయంత్రం గ్రామ పరిధిలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు గమనించి ఆమెను బయటకు తీసి చూడగా.. అప్పటికే మృతిచెందింది. మృతురాలి కుమారుడు హంస్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేడుకగా సంబురాలు


నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ గీతం ఆలపిస్తున్న కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనాదీప్తి, అదనపు కలెక్టర్లు


నల్లగొండలో స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తున్న కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనాదీప్తి


నల్లగొండలో పోలీసులకు సేవా పతకాలు అందజేస్తున్న కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనాదీప్తి


సూర్యాపేట కలెక్టరేట్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ వెంకటరావు, ఎస్పీ రాహుల్ హెగ్డే, అధికారులు


సూర్యాపేటలో సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు


సూర్యాపేట: సిరిపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ


భువనగిరి కలెక్టరేట్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు


భువనగిరి పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద కలెక్టర్ హనుమంతు కె. జెండగే, డీసీపీ రాజేష్‌చంద్ర, అధికారులు

‘పుడమి’ లాభనష్టాలపై ఆడియో వైరల్

- డీజీఎంల వాట్సప్ గ్రూప్‌లో పోస్ట్ చేసిన కంపెనీ డైరెక్టర్



మునుగోడు: అధిక వడ్డీ ఇస్తామని ఆశచూపి మోసం చేసిన పుడమి ఇన్‌ఫ్రా కంపెనీకి చెందిన ఓ డైరెక్టర్ కంపెనీ లాభనష్టాలపై చర్చించిన ఆడియో వైరల్ అవుతోంది. ఆ కంపెనీకి చెందిన డీజీఎంలతో ఏర్పాటు చేసుకున్న వాట్సప్ గ్రూపులో కంపెనీ డైరెక్టర్లలో ఒకరు ఆ కంపెనీలో ఎంతమంది పెట్టుబడులు పెట్టారు.. ఆ డబ్బులతో ఎక్కడెక్కడ ఆస్తులు కొనుగోలు చేశారు.. పెట్టుబడులు పెట్టించినవారికి ఎంత కమీషన్ ఇచ్చారు.. అనే వివరాలతో కూడిన ఆడియోను పోస్ట్ చేశాడు. మొదట డివైన్ కంపెనీ ప్రారంభించినప్పుడు రూ.25.60కోట్ల వ్యాపారం చేశామని, ఆ తర్వాత పుడమి ఇన్‌ఫ్రా కంపెనీ ఏర్పాటుచేసి రూ.84.30కోట్ల వ్యాపారం చేశామని ఆడియోలో తెలిపాడు. తర్వాత నూతనంగా పెట్టుబడులు పెట్టిన వారితో కలిపి మొత్తం రూ.166 కోట్లకు పైగా వ్యాపారం చేశామని, అందులో భూమి కొనుగోళ్లకు రూ.22.96 కోట్లు, డీజీఎంలకు కమిషన్ రూపంలో రూ.20.96 కోట్లు ఇచ్చామని పేర్కొన్నాడు. కంపెనీ ఏర్పాటు చేసిన ముగ్గురు డైరక్టర్లం కలిసి రూ.15 కోట్లు తీసుకున్నామని, ఆ నగదు తిరిగి కస్టమర్లకు ఇస్తామని, అదేవిధంగా పెట్టుబడులు పెట్టినవారికి రూ.20.66 కోట్ల వరకు తిరిగి ఇచ్చామని వివరించాడు. ఇంకా మేడిపల్లి, నార్సింగిలో కొనుగోలు చేసిన భూమి విలువ తనకు తెలియదన్నాడు. అదే విధంగా చిట్యాల, కొండమడుగు సహా ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేసిన భూముల విలువ రూ.35 కోట్లు ఉంటాయని ఆడియోలో పేర్కొన్నాడు.

డీజీఎంల వల్లే అజ్ఞాతంలోకి వెళ్లాం..

కంపెనీ లావాదేవీలు సాఫీగా సాగుతున్న సమయంలో కొందరు డీజీఎంలు చేసిన తప్పుల కారణంగానే ముగ్గురు డైరక్టర్లం అజ్ఞాతంలోకి వెళ్లామని అన్నాడు. పెట్టుబడిదారులు నగదు అడిగితే డీజీఎంలు వారికి వచ్చిన కమీషన్లు ఇచ్చి ఈ విషయం బయటకు రాకుండా చూడాలని కోరామని, అయినా విషయం బయటకు రావడంతో పాటు ఈడీ నోటీసుల కారణంగా తాము స్థానికంగా ఉండకుండా కుటుంబ సభ్యులను వదిలి ఇతర ప్రాంతాలల్లో ఉంటున్నామని, ఇప్పటికైనా డీజీఎంలు అంతా ఒక్కతాటి పైకి వచ్చి ఈ గొడవని పెద్దది చేయకుండా సామరస్యంగా పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరాడు. పెట్టుబడిదారులు తమ ఇళ్ల వద్ద ఆందోళనలు చేస్తే ఏ ఒక్కరికి డబ్బులు ఇవ్వలేమని, ఎవరికీ కనిపించకుండా ఇతర ప్రాంతాలకు వెళ్తామని హెచ్చరించాడు. ఇది విన్న పలువురు పెట్టుబడుదారులు ఏంచేయాలో అర్థంకావడం లేదని, తమని నమ్మించి వందల కోట్ల రూపాయలు వసూలు చేసి అజ్ఞాతంలోకి వెళ్లిన పుడమి ఇన్‌ఫ్రా కంపెనీ డైరెక్టర్లని పట్టుకొని తమకు తగిన న్యాయం చేయాలని పోలీసులను వేడుకుంటున్నారు.

జాతీయ జెండాకు అవమానం


చింతలపాలెంలో జాతీయ జెండా కన్నా ఎక్కువ ఎత్తులో ఉన్న బీఆర్ఎస్ పార్టీ జెండా


కొండమల్లేపల్లి: తలకిందులైన జెండాను సరిచేస్తున్న ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంలో జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేశారు. ఈ విషయాన్ని గమనించిన అధికారులు వెంటనే జాతీయ జెండాను సరిచేసి మరలా ఎగురవేశారు.

తక్కువ ఎత్తులో జాతీయ జెండావిష్కరణ..

హుజూర్‌నగర్ (చింతలపాలెం): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజు జాతీయ జెండాకు అవమానం జరిగింది. ఆదివారం చింతలపాలెంలో మండల బీఆర్ఎస్ నాయకులు జాతీయ జెండాను తక్కువ ఎత్తులో ఉంచి ఎగురవేశారు. దాని పక్కనే బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎక్కువ ఎత్తులో ఎగురవేశారు. ఈ ఫొటోలు స్థానిక వాట్సాప్ గ్రూపులలో కొందరు పోస్టు చేయడంతో అవి వైరల్‌గా మారాయి.

లింగగిరి పీహెచ్‌సీలో..

హుజూర్‌నగర్‌రూరల్: హుజూర్‌నగర్ మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేశారు. అక్కడే ఉన్న సిబ్బంది గుర్తించి జెండాను మార్చి ఆవిష్కరించారు. కాగా మండల వైద్యాధికారిణి పుష్పలత వడదెబ్బ కారణంగా సెలవులో ఉండటంతో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ జాతీయన జెండాను ఆవిష్కరించారు.


హుజూర్‌నగర్‌రూరల్: లింగగిరి పీహెచ్‌సీలో తలకిందులుగా ఆవిష్కరించిన జాతీయ జెండా

జెండా ఆవిష్కరణకు రాని పోలీసులు..

నార్కట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి పోలీసులు హాజరుకాలేదు. జాతీయ జెండా ఆవిష్కరించే సమయంలో గౌరవ వందనం చేయడానికి పోలీసులు రాకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆశ్చర్యానికి గురయ్యారు. పోలీసులు రాకపోయినప్పటికీ తహసీల్దార్ జెండా ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఎస్ఐ అంతిరెడ్డికి తహసీల్దార్ ఫోన్ చేసి జాతీయ జెండా ఆవిష్కరణకు పోలీసులు ఎందుకు రాలేదో వివరణ ఇవ్వాలని కోరినట్లు సమాచారం.

గ్రామీణ వైద్యులపై దాడులు సరికాదు

- సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు


మాట్లాడుతున్న హనుమంతరావు

నల్లగొండ టౌన్: జిల్లాలో తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యులు ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లపై దాడులు చేయడం సరికాదని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణ పరిధిలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు క్లినిక్‌లపై వెంటనే దాడులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. ప్రభుత్వం స్పందించి పీఎంపీ, ఆర్ఎంపీలకు న్యాయం చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో డీఎస్ఎన్. చారి, బి. శ్రీనివాసరాజు, గోగిరెడ్డి నరసింహారెడ్డి, చొల్లేటి బ్రహ్మచారి, ఎండీ నజీరుద్దీన్, వెంకటేశ్వర్లుగౌడ్, వనం యాదగిరి, గుణగంటి రాజశేఖర్‌రావు, ఆమనగంటి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బస్సులో ప్రయాణికురాలి బ్యాగు చోరీ

భువనగిరి క్రైం: బస్సులో ప్రయాణికురాలి బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వివరాలు.. భువనగిరి పట్టణంలోని కరెంట్ ఆఫీస్‌లో పనిచేస్తున్న దోరపల్లి సాయమ్మ ఆదివారం ఆర్టీసీ బస్సులో భువనగిరి నుంచి నల్ల గొండకు వెళ్తుండగా ఆమె బ్యాగును గుర్తుతెలియని చోరీ చేశారు. నల్లగొండ రోడ్‌లో గల ఫ్లైఓవర్ వద్ద ఆమె తన బ్యాగు చోరీకి గురైనట్లు గుర్తించి డ్రైవర్, కండక్టర్‌కు చెప్పగా.. వారు బస్సు మొత్తం వెతికినప్పటికీ బ్యాగు కనిపించలేదు. బ్యాగులో మూడు తులాల బంగారం, సుమారు రూ.66వేల విలువైన వెండి ఆభరణాలు ఉన్నాయని బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరస్వామి తెలిపారు.

సూర్యక్షేత్రంలో మహాసౌర హోమం


మహాసౌర హోమంలో పాల్గొన్న భక్తులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణ స్వామి క్షేత్రంలో ఆదివారం మహాసౌర హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌర హోమాన్ని నిర్వహించారు. అదేవిధంగా క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద సత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రమీల

కోదాడ: పట్టణంలోని సీసీ రెడ్డి విద్యా నిలయంలో ఆదివారం ఉమ్మడి జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలను కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కోదాడలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కౌన్సిలర్లు కర్రి శివ సుబ్బారావు, కందుల చంద్రశేఖర్, మదార్, కోదాడ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు లాం దేవరాజ్, కార్యదర్శి వినయ్‌భాస్కర్, పీఈటీ గోపి, విజయ్, ప్రభాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రూ.5లక్షలు ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు


వివరాలు తెలుసుకుంటున్న సీఐ శ్రీను

తుంగతుర్తి: తాళం వేసిన ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి రూ.5లక్షలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన ఆదివారం తుంగతుర్తి మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన నార్లపురం శ్రీనివాస్ గత కొన్నేళ్లుగా స్థానికంగా హోటల్ నిర్వహిస్తున్నాడు. రోజుమాదిరిగా ఆదివారం ఉదయం 6గంటల సమయంలో తన భార్యతో కలిసి హోటల్‌కు వెళ్లాడు. ఈ తర్వాత అరగంట తర్వాత తన కుమారుడు, మరో అరగంట తర్వాత తన కుమార్తె కూడా ఇంటికి తాళం వేసి హోటల్‌కు వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి వెనక నుంచి లోపలికి ప్రవేశించి తాళం పగులగొట్టి బీరువాలోని రూ.5లక్షల నగదును ఎత్తుకెళ్లారు. శ్రీను కుమారుడు ఇంటికి వెళ్లి చూడగా తాళం పగులగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా.. బీరువా తెరిచి ఉండడంతో తండ్రికి సమాచారం ఇచ్చాడు. శ్రీను వెంటనే ఇంటికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించాడు. తాను అప్పు చెల్లించేందుకు రూ.8లక్షలు తెచ్చి బీరువాలో ఉంచానని వాటిలో నుంచి రూ.5లక్షలు చోరీకి గురైనట్లు శ్రీను పోలీసులకు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీను తెలిపారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ


మహిళ మెడలో పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన చైన్ స్నాచర్స్

గుండాల: గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలో పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన గుండాల మండలంలోని అనంతారం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతారం గ్రామానికి చెందిన నమిలె యాదమ్మ గ్రామం నుంచి కిషన్‌గూడెం వైపు వెళ్తుండగా గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి యాదమ్మ మెడలో ఉన్న మూడున్నర తులాల పుస్తెలతాడు లాక్కెళ్లారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు. మోటకొండూర్ మండలం తేరాల ఎక్స్ రోడ్ వద్ద ఉన్న సీసీ టీవీ ఫుటేజీలో నిందితులు పారిపోతున్న దృశ్యాలు లభ్యమయ్యాయి. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

వడదెబ్బతో ఇద్దరు వృద్ధులు మృతి

హుజూర్‌నగర్‌రూరల్: వడదెబ్బకు గురైన వృద్ధురాలు చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. వివరాలు.. హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన పందిళ్ల వెంకమ్మ(90) గ్రామంలో గల ఆంజనేయస్వామి దేవాలయంలో స్వీపర్‌గా పనిచేస్తోంది. గత రెండు మూడు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో వడదెబ్బకు గురైన వెంకమ్మ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు ఒక కుమారుడు ఉన్నాడు.


భిక్షమమ్మ(ఫైల్)

→ ఆత్మకూర్ (ఎస్): మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన జంపాల భిక్షమమ్మ(75) ఎండ తీవ్రత కారణంగా మూడురోజుల క్రితం అస్వస్థతకు గురైంది. స్థానికంగా చికిత్స పొందుతున్నప్పటికీ ఆరోగ్యం క్షీణించి ఆదివారం మృతిచెందింది. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉండగా.. కుమారుడు గతంలోనే మృతిచెందాడు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మి నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం, మూల విరాట్ స్వామికి పంచామృతాభిషేకం జరిపించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, రక్షాబంధనం, ఋత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ పూర్తి గావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు విజయ్‌కుమార్, ఈఓ నవీన్ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శాలిగౌరారం ప్రాజెక్టుకు జలకళ

- ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులు
- ప్రస్తుతం 16.5 అడుగులకు చేరిన నీటిమట్టం


నీటితో కళకళలాడుతున్న శాలిగౌరారం ప్రాజెక్టు

శాలిగౌరారం: శాలిగౌరారం రిజర్వాయర్ జలకళను సంతరించుకుంది. మండువేసవిలో మూసీనది ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతూ 16.5 అడుగులకు చేరుకుంది. మూసీనది నుంచి శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీటిని తీసుకొచ్చే రాచకాల్వలో ఆయకట్టు రైతులు శ్రమదానం చేసి చెత్తాచెదారాన్ని తొలగిస్తుండటంతో ప్రాజెక్టులోకి వరద క్రమంగా వచ్చి చేరుతూ ప్రస్తుతం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువకు చేరుకుంది.

ఐదు వేల ఎకరాల ఆయకట్టు..

శాలిగౌరారం ప్రాజెక్టు 1200 ఎకరాల విస్తీర్ణంలో 21 అడుగుల నీటి సామర్థ్యంతో 5 వేల ఎకరాల ఆయకట్టు కలిగి ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 16.5 అడుగులకు చేరుకోవడం, ఎగువ నుండి వరద వచ్చి చేరుతుండటంతో రెండు, మూడు వారాల్లో పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకోనుంది. మండువేసవిలో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలో ఉండడంతో ఈ సారి వానాకాలం, యాసంగి సాగుకు నీటి విడుదల ఉంటుందని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలువల్లోకి నీటిని నిలిపివేయడంతో..

శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చేందుకు పల్లివాడ వద్ద నిర్మించిన ఆనకట్ట చివరిది. పల్లివాడ ఆనకట్టకు ఎగువభాగంలో ఆసిఫ్‌నహర్, భీమలింగం, ధర్మారెడ్డి, బునాదిగాని, పిల్లాయిపల్లి, బాచారం ఆనకట్టలు ఉన్నాయి. ఈ ఆనకట్టల వద్ద మూసీనదికి ఇరువైపులా ఉన్న కాల్వల పరిధిలో పంటలకు ప్రస్తుతం నీటిని నిలిపివేయడంతో మూసీనది ప్రవాహం నేరుగా పల్లివాడ ఆనకట్ట మీదుగా మూసీనదిలోకి ప్రవహిస్తుంది. అక్కడి నుంచి పల్లివాడ ఆనకట్ట వద్ద ఉన్న హెడ్‌రెగ్యులేటర్ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టు రాచకాల్వలోకి నీటిని మళ్లించడంతో వరదనీరు శాలిగౌరారం ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది.

అలుగులుపోస్తున్న అనుసంధాన చెరువులు..

శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చే ప్రధాన రాచకాల్వకు రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాలకు చెందిన పలు చెరువులు, కుంటలు అనుసంధానమై ఉన్నాయి. రాచకాల్వ ద్వారా వస్తున్న వరదనీరు నేరుగా ఆయా చెరువులోకి మొదటగా చేరడంతో ఆ చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండాయి. ఎస్జీ కొత్తపల్లికి చెందిన కందికుంట, గారెకుంట ఫీడర్‌చానెల్ చెరువులు అలుగులు పోస్తుండటంతో ఆ వరద నీరు శాలిగౌరారం ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది.